క్లుప్తంగా

ఖేలో ఇండియా సెపక్ తక్రాకు జిల్లా క్రీడాకారుల ఎంపిక


నల్లభవ్యశ్రీ


సాత్విక్‌రెడ్డి

నిజామాబాద్‌నాగారం: బీహార్‌లో ఈ నెల 4 నుంచి జరిగే అండర్–18 ఖేలో ఇండియా సెపక్ తక్రా టోర్నమెంట్‌కు జిల్లాకు చెందిన అన్నం సాత్విక్ రెడ్డి, బాలికల విభాగంలో నల్ల భవ్యశ్రీ ఎంపికయ్యారని జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గాధారి సంజీవ్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ.. ఎంపికైన క్రీడాకారులు టోర్నీలో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని సూచించారు.

అండర్-17 రెజ్లింగ్ క్రీడాకారుల జిల్లా జట్టు ..



నిజామాబాద్‌నాగారం: జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా(కామారెడ్డి, నిజామాబాద్)లకు సంబంధించి అండర్–17 విభాగంలో బాలబాలికల జట్టును ఎంపిక చేశారు. నగరంలోని ప్రభుత్వ స్విమ్మింగ్‌పూల్ ఆవరణలో గురువారం ఎంపిక పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఈ నెల 3న రంగారెడ్డిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నారు. బాలికల్లో సోనియా, రోజా, స్రవంతి, పి స్రవంతి, త్రిషలు.. బాలురలో టి.వెంకటేష్, ప్రవీణ్, గంగాధర్, శ్రీకాంత్, జైపాల్, అర్జున్, రాహుల్ ఎంపికయ్యారు.

రోగులకు పండ్లు పంపిణీ

నిజామాబాద్‌నాగారం: ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ రిటైల్ బట్టల గుమాస్తాల సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అధ్యక్షుడు జాడె సంతోష్ మాట్లాడుతూ..యాజమాన్యాలు కార్మికుల శ్రమదోపిడీ తగ్గించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి వై.రాజు, కోశాధికారి న్యాలపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మూడ రవి, రాజేశ్వర్, తదితరులున్నారు.

ఉచితంగా మజ్జిగ పంపిణీ

సుభాష్‌నగర్: నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అక్షిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ సన్నీ కుమార్ రాపాక మాట్లాడుతూ.. వేసవిలో ఎండ వేడిమి దృష్ట్యా ప్రయాణాలు చేస్తున్న వృద్ధులు, చిన్నారులు, ప్రయాణికుల కోసం మజ్జిగ పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

ఆస్తిపన్ను చెల్లించే గడువు వారం పెంపు

నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆస్తిపన్ను చెల్లింపుదారులకు ఈ నెల 7 వరకు గడువు పొడిగించారు. ఆస్తిపన్ను మొత్తం చెల్లించినవారికి 5 శాతం సబ్సిడీని సైతం ఇవ్వనున్నారు. మార్చి 31 వరకు చివరి గడువు కాగా ఈ గడువును ఒక నెల పెంచుతూ ఉత్తర్వులు జారీచేశారు. పెంచిన గడువు సైతం ఏప్రిల్ 30తో ముగిసింది. అయితే ఈ అవకాశాన్ని ఈ నెల 7 వరకు ఇస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

రెడ్‌క్రాస్ సిబ్బందికి సన్మానం



నిజామాబాద్ నాగారం: ప్రపంచ కార్మిక దినోత్సవం పురస్కరించుకొని తెలుగు వెలుగు సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గురువారం ఖలీల్‌వాడిలో రెడ్‌క్రాస్ సంస్థ సిబ్బందిని శాలువా, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. అలాగే ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన వారి ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ప్రముఖ వైద్యులు చాడ గోపికృష్ణ, ప్రముఖ న్యాయవాది రాజ్‌కుమార్ సుబేదార్, డాక్టర్ రాజేష్, రెడ్‌క్రాస్ చైర్‌పర్సన్ ఆంజనేయులు, కరిపె రవీందర్ తదితరులున్నారు.

భూలోకం చలపతిరావు జయంతి

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా సైక్లింగ్ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని స్నేహ సొసైటీలో భూలోకం చలపతి రావు జయంతి ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నిజామాబాద్ జిల్లా సైక్లింగ్ సంఘం ఉపాధ్యక్షులు రాజ్ కుమార్ సుబేదార్ హాజరై మాట్లాడారు. జిల్లాలో, రాష్ట్రంలో సైక్లింగ్ క్రీడకు భూలోకం చలపతిరావు ఎంతో కృషి చేశారన్నారు. చలపతిరావు కుమారుడు విజయకాంత్ రావు సైక్లింగ్‌ను జిల్లాను జిల్లాలో రాష్ట్రంలో మరింత ముందుకు తీసుకెళ్లడమే గొప్ప విషయమన్నారు. పిల్లలకు పండ్లు, అన్నదానం చేశారు. ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు, సూర్యప్రకాష్, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, సురేందర్, గంగాధర్, దుర్గా మల్లేష్, వినోద్, ప్రవీణ్, శేఖర్ నరేష్ కుమార్, శ్రీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.


గాంధీగంజ్‌లో జెండా ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు


టీయూసీఐ ఆధ్వర్యంలో ..


జెండా ఆవిష్కరిస్తున్న బీఎల్‌పీ నాయకులు

మేడే స్ఫూర్తితో ఉద్యమిద్దాం

సాక్షి నెట్‌వర్క్:ప్రపంచ కార్మికుల దినోత్సవం 'మేడే'ను గురువారం రూరల్, అర్బన్ నియోజకవర్గాల పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు, నేతలు జెండాలను ఆవిష్కరించారు. అనంతరం పటాకులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. ర్యాలీలు నిర్వహించారు. కార్మిక నేతలు మాట్లాడుతూ.. కార్మిక హక్కుల రక్షణ కోసం మేడే స్ఫూర్తితో ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. కేంద్రం ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి అన్యాయం చేస్తోందన్నారు. ఈ లేబర్ కోడ్ వల్ల కార్మికుల పోరాడి సాధించుకున్న హక్కులు కోల్పోతున్నారని వాపోయారు.


తెయూ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ..


నిజామాబాద్ ఏఎంసీలో జెండా ఆవిష్కరిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, చైర్మన్ ముప్ప గంగారెడ్డి


గడ్కోల్‌లో.. మాస్‌లైన్ నాయకులు


నగరంలోని మాధవనగర్‌లో..


సీఐటీయూ పార్టీ కార్యాలయంలో..


ధర్పల్లిలో ..మాస్‌లైన్ నేతలు


డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లిలో..

ప్రైవేట్‌లో సిరిచందన..గవర్నమెంట్‌లో వైష్ణవి

- వంద శాతం ఉత్తీర్ణత సాధించిన 13 ప్రభుత్వ పాఠశాలలు


సిరిచందన, 584, విక్టరీ హైస్కూల్


వి.వైష్ణవి, 571, రాంపూర్ జెడ్పీహెచ్‌ఎస్


టి.శ్లోక, 568, గురుకుల పాఠశాల ధర్మారం(బి)

డిచ్‌పల్లి: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించి విక్టరీ హైస్కూల్(టీజీఎస్పీ 7వ బెటాలియన్) విద్యార్థిని కే.సిరి చందన 584 మార్కులతో, ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి రాంపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని వి.వైష్ణవి డిచ్‌పల్లి మండల టాపర్లుగా నిలిచారు. డిచ్‌పల్లి ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పదవ తరగతి పరీక్షలకు మొత్తం 1,237 మంది విద్యార్థులు హాజరు కాగా 1,198 మంది ఉత్తీర్ణత (96.85 శాతం) సాధించారు. 571 మార్కులతో బి.హేమంత్ సింగ్, వై.సాకేత్ (ఎంజేపీటీ బీసీ గురుకుల బాలుర పాఠశాల, నిజామాబాద్ రూరల్), బి.అక్షిత (విక్టరీ హైస్కూల్) విద్యార్థులు మండల స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే 13 ప్రభుత్వ పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

పదిలో అరబిందో విద్యార్థుల ప్రతిభ


శివరాజ్


మనస్విని

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని శ్రీఅరబిందో పాఠశాలకు చెందిన విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటారు. శివరాజ్ (556), మనస్విని(555), స్వాతి(553), స్వప్న(545), అభిలాష్ (542),మధులత(541) అత్యధిక మార్కులు సాధించారు. 22 మంది విద్యార్థులకు 500కుపైగా మార్కులు సాధించినట్లు పాఠశాల సెక్రటరీ లింగారెడ్డి తెలిపారు. పదవ తరగతి ఫలితాల్లో శివాజీ నగర్ లోని శ్రీరామకృష్ణ విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు కూడా సత్తా చాటారు. ఎస్ చందన 552 మార్కులు, కే సంజన 547, తదితరులు అత్యధిక మార్కులు సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ సముద్రాల శ్రీనివాసాచార్యులు అభినందించారు.

శ్రీచైతన్య టెక్నో విద్యార్థులు..

నిజామాబాద్ రూరల్: పదవ తరగతి ఫలితాల్లో వినాయక్‌నగర్‌లో గల శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ సీహెచ్ లత తెలిపారు. జంజిరాల అక్షయ 573 మార్కులతో టాపర్‌గా నిలిచారు.

ప్రమాదాలకు నిలయంగా మూల మలుపు


గడ్కోల్ వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు


మూలమలుపు వద్ద బోల్తా పడిన కారు(ఫైల్)

- గతంలో మూలమలుపు వద్ద జరిగిన ప్రమాదంలో జర్నలిస్ట్ మృతి
- అదుపుతప్పి బోల్తా పడుతున్న వాహనాలు

సిరికొండ: మార్గమధ్యలో ఉన్న మూలమలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సిరికొండ నుంచి కామారెడ్డికి వెళ్లే మార్గంలో గడ్కోల్ తాళ్ల గుండు ఎక్స్ రోడ్ నుంచి హొన్నాజీపేట్, వాడి గ్రామాల మీదుగా సిరికొండ– నిజామాబాద్ వెళ్లే మార్గంలో మద్దుల్ ఎక్స్ రోడ్ వరకు రోడ్డును విస్తరించారు. రూ.16 కోట్లతో రోడ్డును రెండు వరుసలుగా మార్చారు. విస్తరించడంతో వాహనాల వేగం పెరిగింది. ఈ మార్గంలో చాలా చోట్ల మూలమలుపులు ఉన్నాయి. గడ్కోల్ నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే మార్గంలో దర్గా వద్ద గల మూలమలుపు మరింత ప్రమాదకరంగా మారింది. ఈ మూలమలుపు ఒక్కసారిగా తిరిగి ఉండటం వల్ల వాహనదారులు తికమక పడి అయోమయానికి గురవుతున్నారు.

కనిపించని హెచ్చరిక బోర్డులు

రెండు వరుసల రహదారిగా మారిన ఈ మార్గంలో మూలమలుపులను, కల్వర్టులను, వంతెనలను సూచించేలా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. రేడియం స్టిక్కర్లను కూడా వేయలేదు. దీంతో రోడ్డు మార్గమధ్యంలో ఎక్కడ ఏమి ఉందో తెలియక ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

ప్రమాద ఘటనలు..

జిల్లాలో ప్రసిద్ధి చెందిన లొంక క్షేత్రానికి జిల్లా కేంద్రం నుంచి వెళ్లడానికి ఈ మార్గం ఎంతో అనువైనది. గతంలో లొంకకు వచ్చిన భక్తులకు చెందిన కార్లు ఈ మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలు జరిగాయి. 2020 మే నెలలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఘటనలో గడ్కోల్ గ్రామానికి చెందిన జర్నలిస్ట్ సతీష్‌రెడ్డి మృతి చెందాడు. మరో ప్రమాదంలో గడ్కోల్ గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి నాలుక తెగిపోయింది. రెండేళ్ల క్రితం సిరికొండకు చెందిన ఇద్దరు ప్రయాణిస్తున్న కారు అర్ధరాత్రి సమయంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న మొక్కజొన్న తోటలో బోల్తాపడింది.

సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి

మద్దుల్ నుంచి గడ్కోల్ వరకు విస్తరించిన రోడ్డులో మూలమలుపుల వద్ద కాని మరెక్కడ సూచిక బోర్డులను, రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేయలేదు. దీని వల్ల రోడ్డుపై ఎక్కడ ఏమి ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మరిన్ని ప్రమాదాలు జరగకముందే హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేయాలి.

– రవీందర్‌గౌడ్, గడ్కోల్

వేసవి సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరం ప్రారంభం


హాజరైన క్రీడాకారులు.. ఎంఈవో శ్రీనివాస్

జక్రాన్‌పల్లి: తొర్లికొండ జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వేసవి సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని ఎంఈవో శ్రీనివాస్ ప్రారంభించారు. వేసవి శిబిరాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేశ్ గౌడ్, పీడీ గంగామోహన్, వినయ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత క్రికెట్ శిక్షణ ప్రారంభం

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లాలోని క్రీడాకారులకు వేసవికాలం దృష్ట్యా ఉచిత శిక్షణ ఇవ్వడానికి క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభించినట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రసేన్ రెడ్డి తెలిపారు. గురువారం జీజీ కళాశాల ఆవరణలో శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు. జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి సురేష్, కోచ్ నయూమ్, ఫారస్‌లు తదితరులు పాల్గొన్నారు.

రేపు అండర్-25 క్రికెట్ జట్టుకు ఎంపికలు

హైద్రాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రెండు రోజుల టోర్నమెంట్‌కు కోసం 25 సంవత్సరాల లోపు, 19 ఏళ్లపైన ఉన్న క్రీడాకారులకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శిలు చంద్రసేన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డిలు గురువారం ప్రకటనలో తెలిపారు.ఈ నెల 3న 5 టీమ్‌లను గిరిరాజ్ కళాశాల మైదానంలో ఉదయం 9 గంటలకు ఎంపిక చేసి బాగా ఆడిన 15 మంది క్రీడాకారులతో కూడిన జాబితాను ఎంపిక చేసి టోర్నమెంట్‌కు పంపిస్తామన్నారు.

అనాథ శవాలకు అంత్యక్రియలు

నిజామాబాద్ నాగారం: వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందిన గుర్తు తెలియని రెండు అనాథ శవాలకు గురువారం ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 1వ టౌన్ పోలీస్ సిబ్బంది అనుమతితో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో 1వ టౌన్ సీఐ రఘుపతి, ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడికి శ్రమశక్తి అవార్డు


అవార్డు అందుకుంటున్న కల్లెడి గంగాధర్

నిజామాబాద్‌నాగారం: నగరానికి చెందిన భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు బండారి గంగాధర్‌కు గురువారం మే డే సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో శ్రమశక్తి రాష్ట్ర స్థాయి అవార్డును అందజేశారు. బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, గంగాధర్, శ్యాంసుందర్ జాజుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. కార్మికుల కోసం తాను ఎంతో కష్టపడ్డాడనిచ తనను గుర్తించిందని కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి త్రయోదశ వార్షికోత్సవ వేడుకలు


వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన దేవాలయం

డిచ్‌పల్లి: ధర్మారం(బి)లో ప్రసిద్ధి చెందిన శ్రీశ్రీదేవీ శ్రీభూదేవీ సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ సముదాయంలోని శ్రీసత్యనారాయణ స్వామి, శ్రీవిజయగణపతి– నవగ్రహములు,

బీసీ సంక్షేమ సంఘం రూరల్ అధ్యక్షుడిగా నియామకం


నరేష్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న మూర్తి


శోభన్‌బాబుకు అందజేస్తూ..

సిరికొండ: బీసీ సంక్షేమ సంఘం నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా తాళ్లరామడుగు గ్రామానికి చెందిన బండారి నరేష్ నియామకమయ్యారు. జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో నరేష్‌కు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ.. బీసీల హక్కుల సాధన కోసం కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

మోపాల్ అధ్యక్షుడిగా శోభన్ బాబు

మోపాల్: బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా మోపాల్ మండల కేంద్రానికి చెందిన తుల శోభన్ బాబును ఎన్నుకున్నారు. ఈమేరకు గురువారం నగరంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో శోభన్‌బాబుకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నారా గౌడ్, నరేష్, రాజాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతా వారోత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈ, ఏడీఈ, ఏఈలు తదితరులు

సుభాష్‌నగర్: మే 1 నుంచి 7 వరకు నిర్వహించే విద్యుత్ భద్రతా వారోత్సవాల వాల్‌పోస్టర్లను నగరంలోని పవర్‌హౌజ్ మీటింగ్ హాల్‌లో గురువారం ఆవిష్కరించారు. నిజామాబాద్ డివిజనల్ ఇంజినీర్(డీఈ) ఎం శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాల నివారణకు సిబ్బంది తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మరమ్మతులు చేపట్టే సమయంలో భద్రతా పరికరాలు వినియోగించాలని, విద్యుత్ ప్రమాదాలు ఎవరికీ జరగకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. ఏడీఈ ఆర్ చంద్రశేఖర్, ఏఈలు రాజేందర్‌రెడ్డి, నగేష్, ఎం ఏ రవూఫ్, టౌన్–1, 6 సిబ్బంది పాల్గొన్నారు.

తోటి విద్యార్థికి ఆర్థిక సహాయం


నగదును అందజేస్తున్న 2011 బ్యాచ్ మిత్రులు

సిరికొండ: సిరికొండ జెడ్పీహెచ్‌ఎస్ 2011 బ్యాచ్ విద్యార్థి సంగీత అనారోగ్యంతో ఉండటంతో తోటి మిత్రులు ఆర్థిక సహాయం చేశారు. బ్యాచ్ మిత్రులు రూ. 22 వేలు, డీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్కోల్ భాస్కర్‌రెడ్డి రూ.5 వేల సాయం అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగీత కుటుంబ సభ్యులకు నగదును గురువారం అందజేశారు. బంజారా శక్తి మూవ్‌మెంట్ రాష్ట్ర యూత్ అధ్యక్షుడు రవినాయక్, యూత్ కాంగ్రెస్ రూరల్ అధ్యక్షుడు మహేందర్, మండల ఉపాధ్యక్షుడు జీవన్‌నాయక్, ప్రశాంత్, గంగామోహన్, అరుణ్ పాల్గొన్నారు.

ఉన్నత విద్యలో రాణించాలి


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సిరికొండ: పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించినట్లుగానే ఉన్నత విద్యలో కూడా రాణించాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సూచించారు. పదిలో ప్రతిభ కనబర్చి మండల టాపర్‌గా నిలిచిన సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు ఎమ్మెల్యేను కలిశారు. విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. డీఈవోను కలవగా ఆయన విద్యార్థులను ప్రశంసించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్కోల్ భాస్కర్ రెడ్డి, ప్రిన్సిపాల్ నర్సయ్య, ఉపాధ్యాయులు గంగారెడ్డి, శంకర్, సతీష్ పాల్గొన్నారు.

ఉగ్రదాడిలో అమరులకు నివాళులు


కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

నిజామాబాద్ సిటీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్‌గావ్‌లో జరిగిన ఉగ్రదాడిలో అసువులుబాసిన అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. గురువారం జిల్లాకేంద్రంలోని గౌతమ్‌నగర్, 17వ రాజీవ్ నగర్ 17లో స్థానికులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అమాయక ప్రజలను కిరాతకంగా చంపినవారిని ఉరితీయాలని నినదించారు.

ఐక్యంగా ఉందాం

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని మాలలు అందరు ఐక్యంగా ఉండి సమస్యలపై పోరాటాలు చేద్దామని నిజామాబాద్ మాలమహానాడు జిల్లా నూతన అధ్యక్షులు చొక్కం దేవిదాస్ అన్నారు. గురువారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో జిల్లా నూతన కమిటీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కార్యవర్గ ప్రమాణస్వీకారం కార్యక్రమం ఈ నెల 18న ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్ వినయ్‌కుమార్, సభ్యులు బుచ్చయ్య, శ్రీనివాస్, గంట చిన్నయ్య, ప్రభాకర్, మోహన్, తూరి సాయన్న, నీరడి గంగాధర్, నాగారావు, పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1 హిట్-10.30, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-2 థండర్‌బోల్ట్స్(ఇంగ్లిష్)-11.00, 4.40
రెట్రో-1.30, 7.20, 10.30
స్క్రీన్-3 రైడ్-2(హిందీ)-11.00,1.40,4.30, 10.30
థండర్‌బోల్ట్స్(ఇంగ్లీష్)-7.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1 హిట్-9.50, 1.05, 4.20, 7.35, 10.50
స్క్రీన్-2 రెట్రో-10.10, 4.25, 10.40
థండర్ బోల్ట్స్(3డీ)-1.35, 7.50
స్క్రీన్-3 రైడ్-2(హిందీ)-10.00, 4.25, 10.50
రెట్రో-1.00, 7.25
స్క్రీన్ -4 తుడరుమ్-10.15, 1.35
సారంగపాణి జాతకం-4.55
రైడ్-2(హిందీ)-7.45 - జింఖానా-10.45
లలితామహల్ రెట్రో దేవి థండర్ బోల్ట్స్ 2డీ
నటరాజ్ రైడ్-2(హిందీ) విజయ్ హిట్

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,200	వెండి(కిలో)	1,00,000
22 క్యారెట్స్	89,725		– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	190
		లైవ్	160
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	గాజరుగడ్డ	40	80
బెండకాయ	35	50	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	50	80	దోసకాయ	12	24
దొండకాయ	25	50	ఆలుగడ్డ	25	50
బీర్నిసుకాయ	80	120	గోబిగడ్డ	12	24
కాకరకాయ	35	60	గోబిపువ్వు	35	60
వంకాయ	20	40	బీట్‌రూట్	20	40
పాలకూర	15	30	కరివేపాకు	60	100
మెంతికూర	70	100	చామగడ్డ	60	80
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	50	80	మామిడికాయ	20	40

–సుభాష్‌నగర్